# నకిలీ పత్రాలతో భూమి దందా
# 8 మంది అరెస్ట్


- 96 సెంట్ల భూమి ఆక్రమణకు కుట్ర వెలుగులోకి
- నకిలీ అడంగల్, పాస్‌బుక్‌లతో మోసం యత్నం
- శ్రీకాకుళం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల అరెస్ట్

**నవతరం -శ్రీకాకుళం, ప్రతినిధి:**

నకిలీ పత్రాలు సృష్టించి విలువైన భూమిని ఆక్రమించేందుకు కుట్ర పన్నిన కేసులో శ్రీకాకుళం రూరల్ పోలీసులు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడిపు నాయుడు కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, రాగోలు గ్రామానికి చెందిన ధర్మాన పద్మావతికి చెందిన సుమారు 96 సెంట్ల విలువైన భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని కొందరు వ్యక్తులు ప్రణాళిక రచించారు. త్వరగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ప్రధాన నిందితుడు తెలుగు సతీష్ కుమార్ తన సహచరులు గేదెలు షణ్ముఖరావు (మరణించారు), మామిడి జగన్నాథంతో కలిసి నకిలీ పత్రాల తయారీలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో గేదెలు షణ్ముఖరావు తన మరణించిన తల్లి గేదెలు భానుమతి పేరుతో నకిలీ భూ రికార్డులు (అడంగల్) సృష్టించి, వాటి ఆధారంగా నకిలీ పాస్‌బుక్ తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఈ పత్రాలను ఉపయోగించి భూమిని తమ పేర్లకు మార్చుకునే యత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు.
అదేవిధంగా ఈ నకిలీ పత్రాల తయారీకి అవసరమైన సుమారు రూ.15 లక్షలను అర్జీ అప్పలరాజు, కరకవలస వడ్డిబాబు, శ్రీరామ సూర్యలు పెట్టుబడిగా పెట్టినట్లు వెల్లడైంది. భూమి అమ్మకం అనంతరం రెట్టింపు లాభాలు పొందాలనే ఉద్దేశంతో వీరు ఈ కుట్రలో భాగస్వాములైనట్లు పోలీసులు తెలిపారు. ఇంకా రియల్ ఎస్టేట్ వ్యాపారులు బొచ్చా గోవిందరాజులు, దాట్ల గోపాలకృష్ణరాజు, కొదురు విజయ్ కుమార్‌లతో కలిసి నకిలీ సేల్ అగ్రిమెంట్లు సృష్టించి భూమిని తమ పేర్లకు మార్చుకునేందుకు ప్రయత్నాలు జరిపినట్లు విచారణలో బయటపడింది. తెలుగు సతీష్ కుమార్ పేరుతో ఉన్న సేల్ అగ్రిమెంట్‌ను ఇతరుల పేర్లకు మార్చేందుకు కూడా తప్పుడు పత్రాలు సిద్ధం చేసినట్లు గుర్తించారు.
తేదీ 06-04-2026న నిందితులు భూమిని ఆక్రమించేందుకు స్థలానికి వెళ్లి కొలతలు వేస్తుండగా గ్రామస్తులకు అనుమానం కలిగి వారిని ప్రశ్నించడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై ధర్మాన చిన్నవాడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.59/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
దర్యాప్తులో భాగంగా 08-04-2026న పోలీసులు తెలుగు సతీష్ కుమార్, మామిడి జగన్నాథం, బొచ్చా గోవిందరాజులు, కొదురు విజయ్ కుమార్, దాట్ల గోపాలకృష్ణరాజు, అర్జీ అప్పలరాజు, శ్రీరామ సూర్య, కరకవలస వడ్డిబాబులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుండి నకిలీ భూ రికార్డులు, పాస్‌బుక్‌లు మరియు ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోందని సీఐ పైడిపు నాయుడు వెల్లడించారు.

నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 147 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
10-04-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి యూజేఎఫ్ కృషి ప్రశంసనీయం



**నవతరం -శ్రీకాకుళం, ప్రతినిధి:**

- వేణుగోపాలరావు
- శ్రీకాకుళంలో యూజేఎఫ్ హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ
- కొత్త కార్యవర్గం ప్రకటన - చౌదరి సత్యనారాయణకు అధ్యక్ష బాధ్యతలు
- 15 ఏళ్లుగా జర్నలిజానికి అంకితమైన సేవలు

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యూజేఎఫ్) చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షులు, సేల్స్ టాక్స్ అధికారి ఆర్. వేణుగోపాలరావు అన్నారు.
గురువారం సాయంత్రం శ్రీకాకుళంలోని ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన యూజేఎఫ్ హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి న్యాయం జరిగేలా యూజేఎఫ్ చేస్తున్న కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధి కోసం మరింత శక్తివంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డా. ఎం.ఆర్.ఎన్. వర్మ మాట్లాడుతూ మేధావులు, నిపుణుల సూచనలతో ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధిపై నివేదిక సిద్ధం చేసి సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ ఈశ్వరరావు మాట్లాడుతూ యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ఢిల్లీ స్థాయిలో కూడా గళం వినిపించిన విషయాలను గుర్తుచేశారు.
అనంతరం యూజేఎఫ్ శ్రీకాకుళం జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షునిగా చౌదరి సత్యనారాయణ, కార్యదర్శిగా బూడుమూరు శ్రీరాములు నాయుడు, కోశాధికారిగా సిపాన సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షునిగా రమణమూర్తి, సహాయ కార్యదర్శిగా సూర్యారావు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా అధ్యక్షుడు చౌదరి సత్యనారాయణ గత 15 ఏళు ్లగా జర్నలిజం రంగంలో నిరంతరం కృషి చేస్తూ వార్తల సేకరణ, ప్రజా సమస్యల వెలుగులోకి తేవడంలో విశేష అనుభవాన్ని సంపాదించారు. అంకితభావంతో పనిచేస్తూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సమాజ సమస్యలపై స్పందన కల్పించడంలో ముందుంటూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన నాయకత్వంలో యూజేఎఫ్ జిల్లా స్థాయిలో మరింత బలోపేతం అవుతుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎం.వి. మల్లేశ్వరరావు, యూజేఎఫ్ ప్రతినిధులు రాము, డి. హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అవమానకర ప్రసారాలు
## రాధాకృష్ణపై కేసు నమోదు చేయాలని సీదిరి ఫిర్యాదు



- మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం
- కాశీబుగ్గ సీఐకి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఫిర్యాదు
- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**నవతరం -పలాస**

రాష్ట్ర మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ABN ఆంధ్రజ్యోతి చానల్‌లో ప్రసారమైన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ాదీచీ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణతో పాటు ఎడిటర్, యాంకర్‌పై కేసు -మిగతా 4లో



# నగర సుందరీకరణే లక్ష్యం..
# ఆగస్టు నాటికి స్టేడియం సిద్ధం



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు 3లో




# దళిత గృహాలకు 'సూర్యఘర్' వెలుగులు

**నవతరం -సరుబుజ్జిలి**

విద్యుత్ బిల్లుల భారం నుంచి దళిత కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఎస్సీ/ఎస్టీ సూర్యఘర్ యోజన' అద్భుతమైన అవకాశమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ -మిగతా 2లో

# సౌరబ్ గౌర్‌తో భేటీ...
# హరికృష్ణ ఆనందం

- పాత జ్ఞాపకాల్ని నెమరువేసుకున్న సందర్భం
- సమాజ సేవకు స్ఫూర్తి అని ప్రశంస
- యువతకు ఆదర్శమూర్తి అని కొనియాడిన హరికృష్ణ
- దీర్ఘకాలం తర్వాత కలయికతో ఆనందం 2లో



ఎడిటోరియల్

# ఇంటికో ఆవు..బర్రె..

**అస్సాంలో బీజేపీకి మూడోసారి అధికారం కట్టబెడితే**

ప్రతి ఇంటికో ఆవు, బర్రె ఇస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అస్సాంలో ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పిస్తున్నారు. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న పార్టీ వాళ్లు చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడగాల్సిందిపోయి...ఆవులు, బర్రెలిస్తామని చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ కాలంలోనే ఆవుల కుంభకోణం వెలుగు చూసింది. అందులో ఆవులన్నీ ఆ రాష్ట్ర అధికార పార్టీ కీలక నేతల పశువుల కొట్టానికి తరలాయే తప్ప ప్రజలకు అందింది లేదు. కాఆవులు, బర్రెలిస్తామని చెప్పడమంటే ప్రజలను అధికారికంగా మరోసారి మోసం చేయడమే. అదే కాకుండా ఈ ఆవులు, బర్రెలన్ని కూడా గుజరాత్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. బీహార్, బెంగాల్ ఎన్నికల సమయంలో చొర బాటుదార్ల ప్రస్తావన లేకుండా బీజేపీ ఎన్నికల ప్రచారం ఒక్క అడుగు కూడా ముందుకు వేయదు. అదే ఎత్తుగడను ఇప్పుడు అస్సాంలో అనుసరించనుంది. దేశం మొత్తమ్మీద అన్ని ప్రభుత్వాలు పోటాపోటీగా ఈ రకమైన ఉచిత పథకాల ప్రవాహాన్ని కొనసాగిస్తున్నాయి. అధికారాన్ని దక్కించుకోవడమే పరమావధిగా ఎన్నికల ముందు అమలుకూ సాధ్యంకాని ఉచిత హామీలను లెక్కకుమించి కుమ్మరించే పని రాజకీయ పార్టీలు చేస్తున్నాయి. దీనికి ఏ బూర్జువా పార్టీ మినహాయింపు కాదు. అవన్నీ ఒక తానులో ముక్కలే. పదవులే పరమావధిగా అధికారమే అంతిమలక్ష్యంగా ప్రజలకు ఉచిత వరాల జల్లులు కురిపిస్తాయి.

అయితే ఇక్కడ కూడా కాషాయ దళం తన కుత్సితత్వాన్ని మరోసారి బయట పెట్టుకుంది. బీజేపీయేతర ప్రభుత్వాలిచ్చిన హామీలు అమలు చేయడం లేదంటూ రంధ్రాన్వేషణ మొదలెట్టింది. ఇలా బొక్కలు వెతకటంలో ఆ పార్టీ నేతలు సిద్ధహస్తులు. నిజంగా పేదలకిచ్చే ఈ అరాకొరా సంక్షేమమే ఆర్థికవ్యవస్థకు భారం అన్న కాషాయనేతలే... సంక్షేమ పథకాల అమలుపై బీజేపీయేతర ప్రభుత్వాలపై విమర్శలు చేయడం, మరోవైపు తమను గెలిపిస్తే ఆవులు, బర్రెలిస్తామనడం విడ్డూరం కాక మరేమిట? మరి రాయితీలు, ప్రోత్సాహకాల పేరుతో పెద్దలకిచ్చే కానుకల మాటేమిటి? ఇది ఇప్పుడు కచ్చితంగా చరించాల్సిన విషయం. వాస్తవానికి గత పందేడ్ల బీజేపీ పాలనలో రైతన్నలకు ఒరగబెట్టిందేమీ లేకపోగా దివాళాకోరు విధానాలతో వారిని నట్టేట ముంచింది. అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనే హామీనిచ్చి గద్దెనెక్కిన కాషాయనేతలు... ఆచరణలో వ్యవసాయ రంగానికి సంబంధించిన బడ్జెట్‌కు కోతలు పెట్టి 'కార్పొరేట్ వ్యవసాయానికి' రూట్ క్లియర్ చేశారు. ఇప్పుడు పాడిరైతులను దెబ్బతీసే కుట్రకు పూనుకుంటున్నారు.

బీహార్‌లో ప్రత్యేక, సునిశిత ఓటర్ల జాబితా సవరణ (సర్) పూర్తయిన తరువాత ఎంత మంది విదేశీయులు లేదా చొరబాటుదార్లు బయటపడ్డారో చెప్పడానికి మాత్రం సాహసించలేకపోయారు. ఎక్కడ ఎన్నికలొచ్చినా బీజేపీకి ప్రధానాధారం మతతత్వ రాజకీయాలే. అస్సాం ఎన్నికల ప్రచారం మొత్తం పౌరుల గుర్తింపు, వలసలు, పౌరసత్వం, చొరబాటుదార్లు అన్న అంశాల చుట్టే తిరుగుతోంది. ఈ అంశాలలో కేంద్ర బిందువు ముస్లింలే. ఈ అంశాలను లేవనెత్తడం ద్వారా హిందువులను, ముస్లింలను విడదీయడానికి బీజేపీ ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. అస్సాం ప్రజల సాంస్కృతిక గుర్తింపు మాయమవుతోందని, స్థానిక అఖిల భారత డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎఐయుడిఎఫ్) సాంప్రదాయక ఓటు బ్యాంకును చీలుస్తోందని బీజేపీ యాగీ చేస్తోంది. ఈ దుష్ప్రచారం అసలు లక్ష్యం ముస్లిమేతర ఓట్లను పోగేయడం. ఎఐయుడిఎఫ్ మతతత్వ పార్టీ అని బీజేపీ ఊదరగొడుతూ ఉంటుంది. ఈ పార్టీ పోటీ వల్ల ముక్కోణపు పోటీ తప్పవన్నది బీజేపీ ఆందోళన, మజ్లిస్ పార్టీ చీల్చేది కాంగ్రెస్ లేదా ఇతర సెక్యులర్ పార్టీలకు నష్టం కలిగించే ముస్లిం ఓటర్లనే కాబట్టి అక్కడ మజ్లిస్ ఎన్ని ఎక్కువ స్థానాలలో పోటీచేస్తే అంత ఉపయోగం. అది పరోక్షంగా బీజేపీకే ఉపయోగం. సాధారణంగా బీజేపీ మతపరమైన ఓట్ల సమీకరణ మీదే ఆధారపడి ఉంటుంది. అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న హిందూ ఓట్లు చెదిరిపోకుండా జాగ్రత పడుతుంది.

ముఖ్యంగా ఎగువ అస్సాంలో మెజారిటీపక్ష ఓట్లను సమీకరిస్తుంది. ఈ వరసలోనే సిఎఎ, ఎన్ఆర్‌సి లాంటి వాటిని బీజేపీ లేవనెత్తుతూ ఉంటుంది. మళ్లీ అధికారంలోకి వస్తే వీటిని అమలు చేసి తీరుతామని అమిత్ షా శపథం చేస్తున్నారు. బీజేపీ వల్లె వేస్తున్న 'వికసిత భారత్'లో నిరుద్యోగం భయంకర స్థాయికి చేరుకుంది. యువతకు మోడీ ఇచ్చిన ప్రధాన హామీ ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాల్లో ఇప్పటివరకు ఒక్క కొత్త ఉద్యోగం కూడా ఇవ్వలేదు. చివరికి ఎక్కడిదాకా వచ్చిందంటే, విధిలేక వీధుల వెంట పకోడీలు అమ్ముకునే పని కూడా ఉపాధి, ఉద్యోగం కిందికే వస్తుందనే స్థాయికి ప్రధాని భాష్యాలు చెప్పారు. ఇప్పుడు వాటి జాబితాలోకి ఆవులు, బర్రెలు కూడా చేరిపోయాయి.

స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాలు ఎప్పుడో గాలిలో కలిసిపోయాయి. ఈ తర్కాన్ని అస్సాం ఓటర్లు గ్రహించాలి.

# వర్షాలు కురిస్తేనా వంశధార పనులా

- వంశధార కాలువ దుస్థితి చూసి రైతులు బాధతో భయాందోళనలు..
- ముఖ్యమైన ప్రధాన కాలువలలో పేరుకుపోయిన పూడికలు కలుపు మొక్కలు...
- కాలువలో చుక్క నీరైనా నిల్వలేని వైనం....
- పోయిన సంవత్సరంలో ఆకు మడులు ఎండిపోయి దమ్ముకు నీరు లేక పడిన బాధలు ఇప్పుడు కూడా తప్పవా అని రైతు ఆవేదన....
- ముందుచూపు చర్యగా పనులు చేసే బాధ్యత లేని అధికార యంత్రాంగం మరియు ప్రభుత్వ పాలకులు





**(నవతరం -టెక్కలి)**

చోద్యం చూస్తున్న ప్రతిపక్ష వర్గాలు రైతు కష్టాలు తీరేది ఎప్పుడు అని ఆవేదనతో నిరీక్షిస్తున్న రైతన్న. నవతరం టెక్కలి. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండల పరిధిలోగల వంశధార పరివాహక పరిసర ప్రాంతంలో గల రైతులు యావన్మంది వంశధార కాలువల దుస్థితిని చూసి చాలా దయనీయంగా ఆందోళనలో చెందుతున్నారు. ముఖ్యముగా టెక్కలి మండల పరిధిలో ప్రధానంగా వంశధార నది 48 ఆర్ ప్రధాన కాలువ మరియు 46 ఆర్ సవర్ పేట మేజర్ కాలువలు మరియు వివిధ కాలువలు చాలా అధ్వాన్న స్థితిలో ఉండి ఒక్క నీటి చుక్క అయినా నిల్వ లేకుండా కాలువలు మొత్తం పూడికలతో గుర్రపు డెక్క మొక్కలతో దట్టముగా నిండి ఉన్నందున రాబోయే ఖరీఫ్ కాలానికి ముందుగా వివిధ పనులను చేపట్టి ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత ప్రభుత్వ పాలనాధికారులతో సంప్రదించి సత్వర పనులు చేసి మా యొక్క రైతాంగాన్ని ఆదుకుంటారని ఆవేదనతో రైతు యొక్క భావన.

# సౌరబ్ గౌర్‌తో భేటీ... హరికృష్ణ ఆనందం

**నవతరం -శ్రీకాకుళం**

తనకు సన్నిహితుడైన సౌరబ్ గౌర్‌ను కలవడం ఆనందంగా ఉందని ప్రముఖ పొలిటికల్ అడ్వైజర్, చిరుదివ్వే చైతన్య ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ హరికృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా, ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సౌరబ్ గౌర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న హరికృష్ణ, సౌరబ్ గౌర్ సందేశం, స్ఫూర్తి తన సమాజసేవా కార్యక్రమాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయనను కలిసిన క్షణాలు ఇప్పటికీ తన మనసులో సజీవంగా ఉన్నాయని తెలిపారు.సౌరబ్ గౌర్ సేవలు ఎంతో మందికి ఆదర్శమని, ముఖ్యంగా యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయని హరికృష్ణ కొనియాడారు. చాలా సంవత్సరాల తర్వాత ఆయనను కలుసుకోవడం ఒక మధుర అనుభూతిని కలిగించిందని వెల్లడించారు.

# దళిత గృహాలకు 'సూర్యఘర్' వెలుగులు

**మొదటిపేజీ తరువాయి**

పేర్కొన్నారు. సరుబుజ్జిలి మండలం మర్రిపాడు, బురిడివలస గ్రామాల్లో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సూర్యఘర్ యోజన ఉత్సవ్'ను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 14 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల ద్వారా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచిత సోలార్ పవర్ ఏర్పాటుతో పాటు, పాత విద్యుత్ బకాయిలపై ప్రత్యేక రాయితీలు, సులభ వాయిదాల పద్ధతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, విద్యుత్ శాఖ డీఈ యోగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు అంబల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌కే వ్యాఖ్యలపై టెక్కలిలో కేసు డిమాండ్



- వైసిపి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ
- టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం
- ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్

**నవతరం -టెక్కలి**

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి "వీకెండ్ కామెంట్ బై ఆర్‌కే" కార్యక్రమంలో వచ్చిన అనుచిత వ్యాఖ్యలపై టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసిపి కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా వెళ్లి కేసు నమోదు చేయాలని కోరారు.

ఈ సందర్భంగా పేరాడ తిలక్ మాట్లాడుతూ, ఇటీవల ప్రసారమైన కార్యక్రమంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసిపి నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని అసత్య, దూషణాత్మక వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతాయుత జర్నలిజానికి విరుద్ధమని అన్నారు.

ఈ అంశంపై వేమూరి రాధాకృష్ణతో పాటు సంబంధిత యాంకర్, ఎడిటర్, మేనేజ్‌మెంట్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆ కంటెంట్‌ను అన్ని వేదికల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దువ్వాడ వాణి, ఎంపీపీ అట్లా సరోజనమ్మ, అన్నెపు రామారావు, సత్తారు సత్యం తదితరులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాతపట్నంలో జనసేనకు భారీ చేరికలు



- వైసీపీ నుంచి 250 మంది చేరిక
- ర్యాలీతో ఊరెత్తించిన కార్యకర్తలు
- పవన్ సిద్ధాంతాలపై ఆకర్షణ
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం

**నవతరం -పాతపట్నం**

పాతపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీలోకి భారీగా చేరికలు చోటుచేసుకున్నాయి. వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సుమారు 250 మంది జనసేనలో చేరారు.

చేరికల సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పట్టణంలోని ప్రధాన కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జనసేన నినాదాలతో ప్రాంతం మారుమోగింది. అనంతరం పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలపై ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా చేరుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాలుగు వేల వ్యాసాల క్లబ్‌లో రాం ప్రదీప్

**తిరువూరు (ఎన్. టీ. ఆర్ జిల్లా)**

వివిధసామజిక అంశాలపై నాలుగు వేల వ్యాసాలు రాసిన అతికొద్ది మంది రచయితలలో ఒకరిగా, అదే విధంగా వేయి రోజుల్లో వేయి వ్యాసాలు రాసిన వ్యాస రచయితగా(తెలుగు రాష్ట్రాల లో)తిరువూరుకు చెందిన జన విజ్ఞాన వేదిక ప్రతినిధి యం. రాం ప్రదీప్ గుర్తింపు పొందారు.బుధవారం ఓ దిన పత్రికకు శంకరంబాడి సుందరాచారి పై రాసిన వ్యాసంతో ఆయన ఈ గుర్తింపు పొందారు.

తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలం, గుంటుపల్లి గోపవరం గ్రామంలో 1979లో జన్మించిన రాం ప్రదీప్ ఇప్పటి వరకు పది పుస్తకాలు, వందకుపైగా పుస్తక సమీక్షలు, కొన్ని కథలు, మరికొన్ని కవితలు రాశారు. ఆయన వ్యాసాల్లో ప్రతిజ్ఞ చేద్దాం,మతం మతానికి ప్రత్యామ్నాయం కాదు, మరో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం అవసరం, మనిషిని మనిషిగా చూసేదే అంబేద్కరిజం, నాస్తికత్వమూ మత స్వేచ్ఛే వంటి వ్యాసాలు అత్యంత ప్రజాదరణ పొందాయి. ఆయన ఎక్కువగా శాస్త్రీయ దృక్పథం, అణగారిన వర్గాల వారి హక్కులు, ప్రజాస్వామ్య విలువలు వంటి తదితర అంశాలపై వ్యాసాలు రాస్తున్నారు. ప్రముఖ వెబ్సైటు లలో కూడా రాంప్రదీప్ వ్యాసాలు ప్రచురింపబడటం విశేషం.ఈ రోజు ప్రత్యేకత పేరుతో ప్రతి రోజు ఒక వ్యాసం రాయడం మరో విశేషం.మన ఊరు -మన గ్రంధాలయం పేరుతో పలు పుస్తకాలు సేకరించి విద్యార్థులకు అందజేశారు. అదే విధంగా తాను రాసిన క్లాస్ రూమ్ ఇంగ్లీష్ పుస్తకాన్ని దాతల సహకారంతో ప్రచురించి ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా అందజేస్తున్నారు.


యం.రాం ప్రదీప్

# చలివేంద్రాలు ప్రజలకు ఉపయోగకరం

**నవతరం-శ్రీకాకుళం**

జేసీ మండవల్లి రవి




చలివేంద్రం ప్రజలకు ఉపయోగకరమని, జేసీ మండవల్లి.రవి అన్నారు. స్థానిక చైతన్య సహకార జూనియర్ కళాశాలకు ఆనుకొని, బాటసారులు, స్థానిక ప్రజలు, వాహన చోదకులు, విద్యార్థుల కొరకు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన విషయం విదితమే. రెండవ రోజు ఉచిత మజ్జికను అందించిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ అరుణకుమారి, వైసిపి నాయకులు, జేసీ మండవల్లి.రవి పాల్గొని మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చటానికి మా వంతు సహకారం అందించామన్నారు. చైతన్య సహకార జూనియర్ కళాశాల రహదారిలో జన సంచారం ఎక్కువ ఉంటుందని, వారందరికీ ఈ చలివేంద్రం ఉపయోగకరమన్నారు. ప్రాజెక్ట్ చైర్మన్ మణిశర్మ, జెసిఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి.భీమ శంకర్ ఆధ్వర్యంలో ఈ మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నెల రోజులు ఏకధాటిగా ఈ మజ్జిగ చలివేంద్రం కొనసాగుతుందని, ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ చంద్రకళ, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ పట్నాయక్, కార్యదర్శి కృష్ణకాంత్, సభ్యులు హరిప్రసాద్, జెసిఐ సన్ రైజర్స్ పూర్వపు అధ్యక్షులు ప్రవీణ్ సింగూరు, ప్రస్తుత కార్యదర్శి ఐతం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నగర సుందరీకరణే లక్ష్యం.. ఆగస్టు నాటికి స్టేడియం సిద్ధం

**నవతరం -శ్రీకాకుళం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించిన 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' లక్ష్య సాధనలో భాగంగా శ్రీకాకుళం నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నగరంలోని పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత గూనపాలెం పార్కును సందర్శించిన అనంతరం, కోడిరామ్మూర్తి స్టేడియం పనులను సమీక్షించారు. స్టేడియంకు సంబంధించిన సివిల్ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని, ఆ వెంటనే శాప్ ద్వారా రూ. 2.6 కోట్లతో అత్యాధునిక క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు వెల్లడించారు.

నగరంలో అభివృద్ధి చేస్తున్న పార్కులకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ముఖ్యంగా కార్గిల్ పార్కులో చిన్నారులు, వృద్ధుల కోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్లను నగర ప్రజలు ఎంతో స్వాగతిస్తున్నారని చెప్పారు. అలాగే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్ఆర్ నిధుల కింద ఒక్కో పార్కుకు రూ. 50 లక్షల చొప్పున నాలుగు పార్కులకి నిధులు కేటాయించినట్లు తెలిపారు. హడ్కో కాలనీ, ఆర్కే నగర్, ఏపీజే అబ్దుల్ కలాం పార్కులను పరిశీలించిన మంత్రి.. నగర ప్రమాణాలను పెంచేలా వీటిని తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా నాగావళి నది ఒడ్డున కిలోమీటరు మేర వాకింగ్ ట్రాక్, రోడ్డు నిర్మిస్తామని.. అలాగే నగరం నుంచి బీచ్ వరకు 9 కిలోమీటర్ల మేర 'గ్రీన్ ఫీల్డ్ రోడ్డు'ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రిజర్వు స్థలాలను కాపాడాలని, పచ్చదనం, ఆహ్లాదం కోసం పార్కులను ఏర్పాటు చేసే పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ కమిషనర్ కూర్మారావు, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ, సుడా ఇంజనీర్ సుగుణాకర రావు, పలువురు అధికారులు, పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఆ ఆలయానికి రాణి శాపం
# సర్పాకారంలో నాంపల్లి గుట్ట





**రాజన్న సిరిసిల్లా జిల్లా**
**తెలంగాణ రాష్ట్రం**

ఓ మహారాణి శాపం కారణంగా 600 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన దేవాలయం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీ లక్ష్మీ సమేత నరసింహస్వామి వారు కొలువైన దివ్య క్షేత్రం నాంపల్లి గుట్ట ఇప్పుడు రాజన్న సిరిసిల్లా జిల్లా కేంద్రంలో ఉంది. ఈ ఆలయాన్ని ఆరు వందల సంవత్సరాల క్రితం చోళులు నిర్మించారని ఆలయ స్థలపురాణం చెప్తుంది. ప్రకృతి సౌందర్యముతో ఆధ్యాత్మికతతో అలారారుతున్న ఈ దేవాలయం కుంకుమ రంగు పాము ఆకారంలో నిర్మించబడింది. ఇది తెలంగాణలోని అతిపెద్ద పాము ఆకారం ఆలయంగా గుర్తింపు పొందిన ప్రసిద్ధ, నరసింహ స్వామి స్వయంభుగా వెలిసిన దేవాలయం. సందర్శకులు పాము పొట్ట ఆకారంలో ఉండే సుదీర్ఘమైన సొరంగం మార్గం ద్వారా భక్తులు గుడిలోకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ పొడవైన సొరంగ మార్గంలో ప్రహ్లాదుడు మరియు హిరణ్యకశిపుని కథలు తెలిపే విగ్రహాలు ఉన్నాయి. సొరంగం చివరన హిరణ్యకశిపుడనే రాక్షసుడిని సహకరించిన నరసింహుని విగ్రహం కూడా ఉంది. నాగదేవతకు చెందిన కొన్ని పురాతన విగ్రహాలను ఇక్కడ భక్తులకు దర్శనమిస్తాడు ఆలయ ప్రవేశ వారం దగ్గర ఉన్న స్తంభం నుండి బయటకు వచ్చేటప్పుడు నరసింహస్వామి విగ్రహాన్ని మనం సందర్శించుకోవచ్చు. అత్యంత ఎత్తైన కొండపై నాగుపాము ఆకారంలో నాంపల్లి గ్రామాన్ని చుట్టుకుని ఉంది. నాంపల్లి గుట్టపై అనేక దేవాలయాలు ఉన్నాయి లక్ష్మి నరసింహ పేరుమాళు ్ళ సాక్షాత్ ఆ దేవదేవుడే నాంపల్లి గుట్టపై వెలసి భక్తుల పూజలందుకుంటున్నాడు.

ఇక్కడ విలువైన దేవుని వస్తువులు, వరండాలు పురాతన శివలింగాలు రాజరాజ నరేంద్రుని కోటలోని విలువైన యుద్ధ సామాగ్రి దోపిడీకి గురయ్యాయని స్థానిక ప్రజలు చెబుతారు.

1000 సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పురాతన ఆలయానికి సిద్ధ మహర్షుల శాపం ఉన్నట్టుగా స్థానిక వయోవృద్ధులు చెబుతారు.

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో నాంపల్లి పుణ్యక్షేత్రం ఉంది.పూర్వం నాంపల్లి గుట్టను నామపల్లి గా పిలిచేవారు. ఈ గుట్టపైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వెలసినట్టు పూజలు జరిగినట్టు ఆధారాలు ఉన్నాయి. క్రీ.శ. 11వ శతాబ్దంలో రాజమహేంద్రవరాన్ని పాలించిన రాజరాజ నరేంద్రుడు వేములవాడ ప్రాంతాన్ని సందర్శించి ఇక్కడి కోనేటి మెట్లు కట్టించారని చెబుతారు.

అలయ పురాణ గాథ

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో నాంపల్లి పుణ్యక్షేత్రం ఉంది.క్రీ. శ. 9-10 సొరంగం ద్వారా వేములవాడలోని రాజేశ్వరి స్వామి ఆలయానికి పూజలు చేసి వచ్చే వారంట.రాజరాజ నరేంద్రుడు అనే రాజు భార్య అయిన రత్నాంగి దేవి సంతానం కోసం నాంపల్లి గుట్టపై ఆంజనేయ స్వామి వారిని ధ్యానించేదట. ఒకనాడు నవ నందులు అనే సిద్ధులు సొరంగం ద్వారా నరులకు కనబడకుండా సంతానం కోసం ధ్యానం చేస్తున్న సమయంలో రత్నాగి దేవి మహారాణిని చూసి ధ్యానం చేయడం కాదు శ్రీ ఆంజనేయ స్వామి వారికి 41 రోజులు అఖండ జ్యోతి వెలిగించి దీక్ష పడితే సంతాన ప్రాప్తి కలుగుతుంది అని చెప్పినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. కొంతకాలానికి రాజదంపతులకు సారంగధరుడు అనే పుత్రుడు జన్మిస్తాడు. రత్నాంగి దేవికి సంతాన ప్రాప్తి కలిగినప్పటికీ ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలువలేదు. పుత్రుడు మరణిస్తాడు. పుత్రుని శోకాన్ని తట్టుకోలేని రత్నాంగి దేవి ఈ ప్రాంతంలో నివసించే వాళ్లంతా కోతుల బెడద తట్టుకోలేక వలసలకు వెళ్లాలని,నాంపల్లి పట్టణ చరిత్ర కాలగర్భంలో కలిసిపోవాలని శాపనార్థం పెట్టిందని నానుడి. అలాగే శ్రీ మన్నపల్లి పట్టణం ఒక కుగ్రామంగా మారాలి అని శాపం పెట్టినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందువలననే ఇక్కడ దేవాలయాలు కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి పూజలకు నోచుకోలేకపోయాయని తెలుస్తోంది.

క్రీ. శ.11 వ శతాబ్దంలో రాజమహేంద్రవరాన్ని పరిపాలించిన రాజరాజనరేంద్రుడు వేములవాడ ప్రాంతాన్ని దర్శించి ఇక్కడి కోనేటికి మెట్లు కట్టించాడని చెబుతుంటారు. ఆయన భార్య రత్నాంగిదేవి ఈ గుట్టపైనే తపస్సు చేసి సారంగధరుడిని కుమారుడిగా పొందిందనేది చారిత్రక కథనం. ఈ కారణంతోనే పెళ్లైన కొత్త జంటలు సంతానం కల్గితే ఇక్కడ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే, నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామిని సంతాన నర్సింహుడనీ పిలుస్తారు. సంతానం కల్గిన దంపతులు, కోర్కెలు తీరిన భక్తులూ ఆలయం తూర్పు వైపున ఉన్న రావి చెట్టుకు ముడుపులు కట్టి వెళ్తుంటారు. ఈ ఆలయానికి ఉన్న మరో విశిష్టత లోపల ఉన్న ఆంజనేయస్వామి రాతి శిల. ఈ హనుమంతుడికి 41 రోజులు మండల దీక్ష పడితే కష్టాలు తొలగిపోతాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. గుట్ట పైన కొండ చరియల మధ్య సహజ సిద్ధమైన రెండు కోనేరులు ఉన్నాయి. క్రీ. శ 9-10 వ శతాబ్దాల్లో నవనాథ శక్తులు అంటే 9 మంది ఈ గుట్టమీద తపస్సు చేసి సిద్ధి పొందారట. వారు నిత్యం ఈ గుహ నుంచి భూగర్భ సొరంగం ద్వారా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి పూజలు చేసి వచ్చేవారట.

ప్రతి యేడు నాంపల్లి గుట్టపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి కల్యాణం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం ,మహాశివరాత్రి వేడుకలు, శ్రావణమాసం ప్రత్యేక పూజలు, శ్రీరామనవమి,గోదారంగనాథుల కల్యాణం తదితర వేడుకలను నిర్వహిస్తారు.నాంపల్లి గుట్ట పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతుంది. ఐదు తలల సర్పాకారంగా నిర్మించిన నాగదేవత ఆలయం. శ్రీ చెన్నమనేని విద్యాసాగర్ రావు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు దాదాపు 50 లక్షలు వెచ్చించి గుట్ట దిగువ భాగములో దీన్ని నిర్మించారు. గుట్టపై నుంచి దూరం నుంచీ చూస్తుంటే మెట్ల మధ్యన చుట్టుకున్న కొండంత పాములా కనిపించడం ఈ ఆలయ ప్రత్యేకత.

నాంపల్లి గుట్ట దేవాలయాన్ని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం 2000 సంవత్సరంలో దత్తత తీసుకొని దీని అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రధాన రోడ్డు నుంచి ఘాట్ రోడ్ మీదుగా గుట్టపై వరకు అన్ని వాహనాలు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం ఉంది అక్కడ నుంచి మెట్లెక్కి గుట్టపై ఉన్న స్వామిని దర్శించుకోవచ్చు. కరీంనగర్లోని వేములవాడ బస్టాండ్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో నాంపల్లి గుట్ట ఉంది.

ఒకే గుడికి శ్రీ ఆంజనేయ స్వామి ,శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనం భాగ్యం అంటుంటారు భక్తులు. అసలు రాజన్న కేంద్రం నిర్మాణానికి మూల కారణం నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రమే అని కొందరు చెబుతున్నారు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# బీజేపీ అసలు నిజం బయటపడింది అన్ని మతాలకు న్యాయమా? లేక ఒకే వర్గానికే మద్దతా?




భారతీయ జనతా పార్టీ గురించి ఈ ప్రశ్న చాలా మంది మనసులో ఉంది. ఒక వర్గం బీజేపీ అన్ని మతాలకు సమాన న్యాయం చేస్తుందని నమ్ముతుండగా, మరో వర్గం మాత్రం ఇది ప్రధానంగా ఒకే వర్గానికి అనుకూలంగా పనిచేస్తుందని భావిస్తోంది. నిజానికి ఈ విషయాన్ని ఒకే కోణంలో కాకుండా సమగ్రంగా చూడాలి.

బీజేపీ అధికారికంగా "సబ్కా సాథ్, సబ్కా వికాస్" అనే నినాదాన్ని ముందుకు తీసుకువస్తుంది. దీని అర్థం మతం, కులం, ప్రాంతం తేడా లేకుండా అందరికీ అభివృద్ధి అందించాలనే లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కూడా సాధారణంగా మత ఆధారంగా కాకుండా అందరికీ అందేలా రూపొందించబడినవి. ఈ కోణంలో చూస్తే, పార్టీ విధానం అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే దిశలో ఉందని చెప్పవచ్చు.

అయితే, విమర్శకుల అభిప్రాయం వేరుగా ఉంటుంది. బీజేపీ హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై ఎక్కువగా దృష్టి పెడుతుందని, కొన్ని రాజకీయ వ్యాఖ్యలు మరియు నిర్ణయాలు మైనారిటీ వర్గాల్లో అనుమానాలను పెంచుతున్నాయని వారు అంటున్నారు. ముఖ్యంగా ముస్లిం మరియు క్రైస్తవ వర్గాలకు సంబంధించిన అంశాల్లో సరైన నమ్మకం కల్పించలేకపోతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా కొందరికి "ఇది హిందువుల పార్టీ" అనే భావన బలపడుతోంది. వాస్తవానికి చూస్తే, పార్టీ చెప్పే విధానం మరియు ప్రజలు అనుభవించే విధానం మధ్య కొంత తేడా కనిపిస్తుంది. బీజేపీ జాతీయత మరియు సాంస్కృతిక విలువలను ప్రధానంగా ప్రోత్సహిస్తుంది. ఈ క్రమంలో హిందూ సంస్కృతి అంశాలు ఎక్కువగా కనిపించడం సహజం. అయితే అదే సమయంలో అధికారికంగా అన్ని మతాలకు సమాన అభివృద్ధి అందించాలనే విధానాన్ని కూడా కొనసాగిస్తోంది.

ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే, కేవలం రాజకీయ ప్రసంగాలు లేదా సోషల్ మీడియాలో వచ్చే వ్యాఖ్యల ఆధారంగా నిర్ణయం తీసుకోవడం సరైంది కాదు. పార్టీ ఏమి చెబుతోంది, అధికారంలో ఉన్న చోట ఎలా అమలు చేస్తోంది, ప్రజలకు నిజంగా ఎలాంటి లాభం కలుగుతోంది అనే అంశాలను గమనించడం అవసరం. ఈ మూడు అంశాల ఆధారంగా విశ్లేషణ చేస్తేనే నిజానికి దగ్గరగా చేరుకోవచ్చు.

మొత్తానికి, బీజేపీ కేవలం ఒకే వర్గానికి మాత్రమే మద్దతు ఇస్తుందని సూటిగా చెప్పడం సరైన విశ్లేషణ కాదు. అలాగే అన్ని మతాలకు పూర్తిగా సమానంగా వ్యవహరిస్తుందని కూడా నిర్ధారించడానికి ప్రజలు ఆధారాలు పరిశీలించాలి. నిజం ఈ రెండింటి మధ్యలో ఉండే అవకాశం ఉంది. ప్రజలు జాగ్రత్తగా గమనిస్తూ, అనుభవాలను ఆధారంగా తీసుకుని తమ అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడం అవసరం.

ఉద్దేశకుడు :
తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా..
9297109223 హైదరాబాద్

# సుఖ దుఃఖాల ముఖ పుస్తకం...




సుఖదుఃఖాల సముద్రం...
అలలపై నవ్వులు...
లోతుల్లో నిశ్శబ్దపు కేకలు...

ముఖ పుస్తకం...
వినోదాల విహారయాత్రలా
మొదలై
బూతు మాటల శవయాత్రగా
ముగిసే ముళ్ళ దారి...

ముఖ పుస్తకంలో...
లైకుల పూలహారాలు మెరుస్తాయి
కామెంట్ల కత్తులు
గుండెను గుచ్చుతాయి...

ముఖ పుస్తకం...
ముళ్ల బాటలో పూల పరిమళం...
పూల తోటలో దాగిన ముళ్ల కాటు...

ముఖ పుస్తకం...
విజ్ఞాన గని వెలుగులో
విషాదాల ప్రతిధ్వని...
వినిపించే లోకం...
ముఖ పుస్తకం...

ముఖ పుస్తకంలో...
అభిమానుల హర్షధ్వానాలు...
ఆగంతకుల గూఢనజరాలు...
గద్దల్లా నీ ప్రతి అడుగును
గమనించే...అదృశ్య నేత్రాలు...

ముఖ పుస్తకం...
మంచి చెడుల సంగమం...

అనంత సమాచారానికి
సింహద్వారం...మాయాగర్భం...
కొందరికి జ్ఞానదీపం...
కొందరికి శాపం...
ఇంకొందరికి నరక కూపం...

ముఖ పుస్తకంలో
మిత్రులతో మాటలు
మాయని మమతలే...
అపరిచితులతో...అపార్థాలతో
ఘాటైన మాటలతో భీకర
యుద్ధాలే...
ఒక చిన్న అపార్థం...
మనశ్శాంతిని మట్టిలో
కలిపేస్తుంది...

ముఖ పుస్తకంలో...
విడిచి పెట్టలేని సరదా ఉంది...
తుడిచిపెట్టలేని బురదా ఉంది...

ముఖ పుస్తకంలో...
24/7 మునిగి
తేలడం...మూర్ఖత్వమే...

మితిమీరని వినియోగం విజ్ఞతే
స్థితప్రజ్ఞతే.
ముఖ పుస్తకం...
ముద్దులతో ముంచేత్తే మాయలేడి...
అతిగా ఆశిస్తే...
అంతరంగాన్ని దహించే
అగ్నికుండం...
అందుకే...
అప్రమత్తతే నీకు శ్రీరామరక్ష...
అజాగ్రత్తే నీకు కఠిన కారాగార
శిక్ష...



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్

# పంట నష్టంపై రైతుల ఆగ్రహం... తక్షణ పరిహారం డిమాండ్

- వడగళ్ల వాన, బలమైన గాలులతో భారీ నష్టం
- బుడుమూరులో రైతుల నిరసన, వినతిపత్రం
- మంత్రి అచ్చెన్నాయుడు స్పందించాలని డిమాండ్
- ఎకరాకు ప్రత్యేక పరిహారం కోరిన సిపిఎం




**నవతరం-లావేరు**

అకాల వర్షాలు, వడగళ్ల వానతో పాటు తీవ్ర గాలుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు డిమాండ్ చేశారు. బుడుమూరు గ్రామంలో రైతులు నిరసన చేపట్టి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మొక్కజొన్న, అరటి, మిరప, నువ్వులు వంటి పంటలు వందల ఎకరాల్లో నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులకు ఇప్పుడు పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇప్పటికీ స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.మొక్కజొన్నకు రూ.50 వేల, అరటికి రూ.1 లక్ష, మిరపకు రూ.1 లక్ష చొప్పున ఎకరాకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# బీసీ ధర్మ దీక్షకు పిలుపు

- ఏప్రిల్ 11 నుంచి ఆమరణ దీక్ష
- హామీలు అమలు చేయాలని డిమాండ్
- కీలక అంశాలపై పోరాటం
- రాష్ట్రవ్యాప్తంగా మద్దతు కోరింపు

**నవతరం -శ్రీకాకుళం**

బీసీల హక్కుల సాధన కోసం ఏప్రిల్ 11 నుంచి మంగళగిరిలో చేపట్టనున్న బీసీ ధర్మ దీక్షను విజయవంతం చేయాలని బీసీవై జిల్లా అధ్యక్షుడు పాలిని ప్రసాద్ పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, బీసీ రక్షణ చట్టం, సమగ్ర కులగణన, రిజర్వేషన్ల పెంపు వంటి అంశాలపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు.




కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలకొండ-పార్వతీపురం ఎక్స్‌ప్రెస్ బస్సు సేవ ప్రారంభం

- ఉదయం 5 గంటలకు తొలి సర్వీస్
- ఉద్యోగులు, విద్యార్థులకు ఉపశమనం
- వినతుల మేరకు సేవలు ప్రారంభం
- రోజంతా పలుమార్లు రాకపోకలు

**నవతరం-పార్వతీపురం**



ప్రయాణికుల సౌకర్యార్థం పాలకొండ-పార్వతీపురం మధ్య ఎక్స్‌ప్రెస్ బస్సు సేవను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. పాలకొండ నుండి ఉదయం 5 గంటలకు బయలుదేరే ఈ బస్సు 6.15 గంటలకు పార్వతీపురం చేరుకుంటుందని చెప్పారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉండనుందని, మార్గమధ్యంలోని ప్రధాన స్టాప్‌లలో ఆగేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల వినతులను పరిగణనలోకి తీసుకుని ఈ సేవను ప్రారంభించామని తెలిపారు.

ప్రయాణికుల స్పందనను బట్టి భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించే అవకాశం ఉందన్నారు. రోజంతా పలుమార్లు ఈ ఎక్స్‌ప్రెస్ బస్సు రాకపోకలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ముఖ్య సమయాలు:
పాలకొండ-పార్వతీపురం: ఉదయం 5.00 - 6.15, పార్వతీపురం-పాలకొండ: ఉదయం 6.40 - 7.55, తదితర సమయాల్లో కూడా సర్వీసులు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

# అవమానకర ప్రసారాలు

మొదటిపేజీ తరువాయి

నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ, "మీడియా అనేది సమాజానికి అద్దం పట్టే వ్యవస్థ. అలాంటి వేదికల ద్వారా మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రసారాలు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం. ఇది కేవలం ఒక వ్యక్తిపై వ్యాఖ్య కాదు, సమాజంలోని మహిళలందరికీ అవమానం" అని అన్నారు.

"మీడియా స్వేచ్ఛను బాధ్యతతో వినియోగించాలి. కానీ కొందరు దాన్ని దుర్వినియోగం చేస్తూ సమాజానికి తప్పు సందేశాలు ఇస్తున్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అసలు ఆమోదయోగ్యం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. "ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎంత పెద్ద మీడియా సంస్థ అయినా చట్టం ముందు అందరూ సమానమే. వెంటనే కేసు నమోదు చేసి న్యాయం చేయాలి" అని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పైల వెంకటరావు (చిట్టిబాబు), పలాస-కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపీ, వజ్రపుకొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి ఉదయకుమార్, మందస ఎంపీపీ దొక్కర దానయ్య, పలాస మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మండల అధ్యక్షులు దువ్వాడ రవి, డల్లి జనాకిరెడ్డి, తిర్రి రాజారావు, మల్లా సురేష్ కుమార్, దువ్వాడ మధుకేశ్వరరావు, ఇరోతు హేమంత్ కుమార్, బెల్లాల శ్రీనివాసరావు తదితరులతో పాటు పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**